







సుల్తాన్‌పూర్ వద్ద నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న కేసీఆర్

మెతుకుసీమ

రుణం తీర్చుకోలేను

మీ దీవెనలతోనే తెలంగాణ తెచ్చుకున్నాం

- ఏ జిల్లాలోనూ లేనంత ఎమ్మెల్యేలను గెలిపించారు
- హరీశ్‌రావు కృషితోనే అది సాధ్యమయ్యింది
- ఆగమాగం కాకుండా ఓటేయండి
- ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 16: ఎన్ని జన్మలెత్తినా మెతుకుసీమ ప్రజల రుణం తీర్చుకోలేనని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ వద్ద మంగళవారం సాయంత్రం మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాదసభలో కేసీఆర్ ప్రసంగించారు. మెతుకుసీమ ప్రజలే తనను ఈస్థాయికి తెచ్చారని.. వారి దీవెనతోనే కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని పేర్కొన్నారు. ప్రజలిచ్చిన శక్తి వల్లే తనకు బలం చేకూరిందని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏ జిల్లాలో రానివిధంగా మెదక్ జిల్లాలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ వచ్చిందని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది స్థానాల్లో ఏడు స్థానాల్లో తమను గెలిపించారని, హరీశ్‌రావు కృషితోనే అది సాధ్యమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థులు వెంకట్‌రాంరెడ్డి, అనిల్‌కుమార్‌లను ఆయన ప్రజలకు పరిచయం చేశారు. మెదక్ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న వెంకట్రాంరెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ప్రజల మన్ననలు చూరగొన్నారని పేర్కొన్నారు. ఆయనకు డబ్బు అవసరం లేదని అన్నారు. జహీరాబాద్ అభ్యర్థిగా ఉన్న గాలి అనిల్‌కుమార్ 2000 సంవత్సరం నుంచి తెలంగాణ ఉద్యమంలో పనిచేస్తున్నారని చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన వ్యక్తి పేర్కొన్నారు. ఆగమాగం కాకుండా ఈ ఎన్నికల్లో వీరిద్దరినీ గెలిపించాలని కేసీఆర్ కోరారు.



సభకు వెళ్తున్న జనం

బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

పుల్‌కల్ : బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాదసభ బీఆర్ఎస్ కార్యకర్తల్లో జోష్ నింపింది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అందోలు, నారాయణఖేడ్, జహీరాబాద్ సెగ్మెంట్లు, మెదక్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సభ 5.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నా సభాస్థలం నిండలేదు. కేసీఆర్ వచ్చే సమయానికి జనంతో కిటకిటలాడింది. ఎర్రవల్లిలోని ఫాంహౌస్ వద్ద మాజీ సెం కారుపై అక్కడి నేతలు పూల వర్షం కురిపించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరిన కేసీఆర్ శామీర్‌పేట వద్ద ఓఆర్ఆర్ ఎక్కి పటాన్‌చెరు వద్ద దిగారు. సంగారెడ్డి సమీపంలోని ఓ గార్డెన్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. రాత్రి 7.05కు కేసీఆర్ ప్రసంగాన్ని ప్రారంభించి 7.30కు ముగించారు. దాదాపు 25 నిమిషాల తన ప్రసంగంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలను వంచించారని విమర్శించారు. అక్కరకు రాని చుట్టమని బీజేపీ తీరును ఎండగట్టారు. కేసీఆర్ ప్రసంగానికి ప్రజలు చప్పట్లతో మద్దతు తెలిపారు. సభలో మానుకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కళాకారుడు సందీప్ నిర్వహించిన ధూంధాం ఆకట్టుకుంది. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాటల రూపంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ అభ్యర్థులు గాలి అనిల్‌కుమార్, బి.వెంకట్రామ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్లు పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, హేమలత శేఖర్‌గౌడ్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సునీతారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, పద్మారెడ్డి, సత్యనారాయణ, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య, నాయకులు పట్లోళ్ల జైపాల్‌రెడ్డి, మఠం భిక్షపతి, ఎర్రోల్ల శ్రీనివాస్, పల్లె సంజీవయ్య, ప్రతాప్‌రెడ్డి, నరోత్తం, దేవీప్రసాద్, బుచ్చిరెడ్డి, రాజేందర్‌ముదిరాజ్, విజయ్‌కుమార్, శివకుమార్, దర్శన్‌రెడ్డి, మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనస్ ఇస్తావా? బొంద పెట్టమంటావా?

సంగారెడ్డి టౌన్ : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. ప్రజా ఆశీర్వాదసభలో ఆయన ప్రసంగించారు. అధికారంలోకి రాగానే వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని మాటిచ్చి.. తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విసుగొచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంచినీళ్లు, ఆసరా పెన్షన్ రావడం లేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ లేదని, రైతు భరోసా ఇవ్వడం లేదని, మహాలక్ష్మి కింద రూ.2,500 పింఛన్, నిరుద్యోగభృతి, కల్యాణలక్ష్మిలో రూ.లక్షతో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని మోసం చేయారని విమర్శించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ప్రజాపాలన అంటూ ఒక్కరోజు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండి తర్వాత పాలనను మర్చిపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల వెంట బడుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ గెలుపును ఆపలేరన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్లలో ఒక్క మంచి పని కూడా చేయలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ కానీ, నర్సింగ్ కాలేజ్ కానీ ఇవ్వలేదని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందని మండిపడ్డారు. అనంతరం బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. రైతు భరోసా ఇవ్వడానికి పంట సాగు చేసిన తర్వాత ఇస్తామని ఓ మంత్రి అనడం రైతులను మోసగించడమేనని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో 70 లక్షల మందికి రైతుబంధు ఇచ్చామని పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



మంజ్యానాయక్‌తండాలో వ్యవసాయ బావి వద్ద తాగునీటిని పట్టుకుంటున్న గిరిజన మహిళలు (ఫైల్)

గొంతెండుతోంది!

- తాగునీటికి తపిస్తున్న గిరిజన తండాలు
- బావుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు
- మంత్రి ఆదేశాలు పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట, ఏప్రిల్ 16: తాగునీటి కోసం అక్కన్నపేట మండలంలోని తండాల ప్రజలు అల్లాడుతున్నారు. జిల్లాలోనే అత్యధికంగా గిరిజన తండాలు ఉన్న ఈ ప్రాంతంలో మండుటెండలకు తోడు నీటి ఎద్దడి తండాలను పట్టిపీడిస్తోంది. కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి గిరిజన మహిళలు బిందెలు ఎత్తుకుని నీళ్లు తెచ్చుకుంటున్నారు. కొందరు ఎడ్లబండ్లపై, మరికొందరు సైకిళ్లపై నీటిని తెచ్చుకుంటున్నారు. నీళ్ల కోసం వ్యవసాయ బావుల వద్దకు వెళ్తే బావి యజమానులు నీళ్లు ఇవ్వకుండా దుర్భాషలాడుతున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూస్తామని, ఇంటింటికీ నీరు అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరకుండానే పోతున్నది. కొన్ని తండాల్లో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను నిర్మించినా పైప్‌లైన్ వేయలేదు. కొన్ని తండాల్లో ట్యాంకుల్లోకి మిషన్ భగీరథ నీరు ఎక్కడం లేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా చూడాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కన్నపేట మండలంలో 60కి పైగా గిరిజన తండాలు ఉన్నాయి. ఒక్కో తండాలో 100 నుంచి 500 మందికి పైగా జనాభా ఉంది. వర్షాభావంతో పాటు ఎండల తీవ్రతతో భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోయాయి. మండలంలోని పలు గ్రామాల్లో 500 నుంచి 700 ఫీట్ల లోతు వరకు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. మంజ్యానాయక్ తండాలో 50 సంవత్సరాలుగా తాగునీటి సమస్యను గిరిజనులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వాటర్ ట్యాంక్ నిర్మించి, పైప్‌లైన్ వేసినా మిషన్ భగీరథ నీరు రావడం లేదు.

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం



తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. ఎన్నికలు వచ్చినప్పుడే నాయకులు మా తండాకు వస్తారు. ఓట్లు వేసి గెలిపిస్తే మీ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి వెళ్తిపోతారు. గెలిచిన తర్వాత ఇటువైపు కన్నెత్తి కూడా చూడరు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– జరుపుల కళావతి, మంజ్యానాయక్‌తండా

నీటి సమస్య ఎదుర్కొంటున్న తండాలు

మండలంలోని మంజ్యానాయక్‌తండా, బొదరువాగుతండా, చౌడుతండా, పెద్దతండా గ్రామపంచాయతీ పరిధిలోని పంజాగుట్టతండా, తాళ్లతండా, దుబ్బతండా గ్రామపంచాయతీ పరిధిలోని సీతారాంతండా, పంచారాయి తండా, వంకాయతండా, దాసుతండా, పంతులుతండా గ్రామపంచాయతీ పరిధిలోని పీక్కుతండా, ధరావత్‌తండా, హేన్‌సింగ్‌తండా, దుబ్బతండా, కుందనవానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చౌటకుంటతండా, సీతారాంతండా, మల్చేరువుతండా గ్రామపంచాయతీ పరిధిలోని నర్సింగ్‌తండాలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నది.

ఖాళీ బిందెలతో ధర్నా

అక్కన్నపేట మండలంలోని మంజ్యానాయక్ తండాలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మంగళవారం గిరిజనులు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. 50 సంవత్సరాల నుంచి తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నా ఎవరు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



మంజ్యానాయక్‌తండాలో ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు



ఎండవేడికి దగ్ధమవుతున్న బైక్

ఎండవేడికి బైక్ దగ్ధం

- సంగారెడ్డిలో ఘటన
- పెట్రోల్ లీకవ్వడంతోనే ప్రమాదం జరిగినట్లుగా అనుమానం

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 16: ఎండవేడికి బైక్ దగ్ధమైన సంఘటన సంగారెడ్డి పట్టణంలో మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వ్యక్తి తన హోండా యాక్టివాను ఫ్రైడే మార్కెట్ రోడ్డు వద్ద నిలిపాడు. కొద్దిసేపటికి బండి నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి, క్షణాల్లోనే బైక్ పూర్తిగా దగ్ధమైంది. పాతబైక్ అవ్వడం, పెట్రోల్ లీకవ్వడంతో ఎండవేడికి మంటలు చెలరేగి బైక్ దగ్ధమై ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు.

బాబోయ్ ఎండలు..

7లో

- బెంబేలెతుతున్న జనం
- ఎయిర్ కూలర్లు, శీతల పానీయాలకు డిమాండ్

మెదక్ కలెక్టరేట్‌లోనే నామినేషన్ల స్వీకరణ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 16: మెదక్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తున్నామని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచందర్‌రాజుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ, నిబంధనలు, ఖర్చుల రిజిస్టర్ నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అభ్యర్థులకు సహకరించడానికి నామినేషన్ కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. నామినేషన్ పత్రాలను అందజేసేందుకు, సెక్యూరిటీ డిపాజిట్ దాఖలుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నామని వివరించారు. నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రత ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

స్వేచ్ఛగా ఓటేసేందుకు చర్యలు

లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు చేసే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. వీడియో నిఘా బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్, ఖర్చుల పర్యవేక్షణ బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని వివరించారు. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అభ్యర్థి స్వయంగా సంతకం చేసిన ప్రతులను కూడా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.



హుస్నాబాద్‌లో వేడుకలకు ముస్తాబైన రామాలయం

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు

సిద్దిపేట అర్బన్/చేర్యాల, ఏప్రిల్ 16: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రధాన ఆలయాలను ముస్తాబు చేశారు. సిద్దిపేట పట్టణంలోని పురాతన రామాలయంలో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా జిల్లాలోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు జరగనున్నాయి. రూరల్ మండలంలోని చింతమడకలో నూతనంగా నిర్మించిన పట్టాభిరామ ఆలయంలో శ్రీరామనవమి వేడుకలకు మాజీ సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించినట్లు సమాచారం. కేసీఆర్ సెంటిమెంట్‌గా భావించే నంగునూరు మండలంలోని కోనాయిపల్లి ఆలయంలోనూ ఏర్పాట్లు పూర్తి చేశారు.

20 నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు మెదక్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ శిబిరాలు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జహీరాబాద్, గజ్వేల్‌లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆన్‌లైన్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. అండర్-14, 16, 19, 23 కేటగిరిలలో క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతుల్లో పాల్గొనేవారు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారై ఉండాలని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మే నెలలో జరిగే జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిబిరాలు సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీ గౌండ్స్ (జూబ్లీ క్లబ్), మెదక్‌లోని స్పోర్ట్స్ స్టేడియం, సిద్దిపేటలోని ప్రొ. జయశంకర్ మినీ స్టేడియం, జహీరాబాద్‌లోని సంఘమిత్ర, గజ్వేల్ ఐవోసీ గ్రౌండ్‌లలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఖేడ్‌కు చేరుకున్న ఈవీఎంలు



ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంకు సీల్ వేసిన ఆర్డీవో

నారాయణఖేడ్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో వినియోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్లు మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి నుంచి ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సాయుధ బలగాల బందోబస్తు మధ్య నారాయణఖేడ్‌కు చేరుకున్నాయి. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తాహేర్ అలీ, పరమేశ్వర్, సాయిరాం, మోహీద్‌ఖాన్, నవాబ్, తదితరులు సమక్షంలో ఖేడ్ పట్టణ శివార్లలోని మోడల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన ఆర్డీవో అశోకచక్రవర్తి స్ట్రాంగ్ రూంకు సీలు వేశారు.

పరీక్షలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

● నర్సాపూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అనిత

నర్సాపూర్, ఏప్రిల్ 16: విద్యార్థుల ఫీజుల కోసం ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని నర్సాపూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.అనిత పేర్కొన్నారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు లీగల్ సర్వీసుకు ఫీజులు కట్టలేదని పరీక్షలు రాయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో ఆమె స్పందించి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చదువులకు సంబంధించి విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కలిగించొద్దని సూచించారు. ఇబ్బందులకు గురిచేసే విద్యాసంస్థలపై తగిన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంఈవో బుచ్యానాయక్‌కు సూచించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

హత్నూర, ఏప్రిల్ 16: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ ఫర్హీన్ షేక్ అన్నారు. మండల కేంద్రమైన హత్నూరలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు ఎవరి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగులకు నిప్పంటించిన దుండగులు



కాలిపోయిన గన్నీ బ్యాగులు

నిజాంపేట, ఏప్రిల్ 16: గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉంచిన గన్నీబ్యాగులకు నిప్పంటించారు. మండల పరిధిలోని రాంపూర్‌లో వారం రోజుల క్రితం రామాయంపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కొనుగోలు కేంద్రంలో ఆవరణలో ఉంచిన గన్నీ బ్యాగులకు నిప్పంటించారు. ఈ ఘటనలో సంచులు కాలిబూడిదయ్యాయి. ఈ విషయమై నిజాంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చిన్నారుల గ్రోత్‌రేట్ పెంపొందించాలి



అంగన్‌వాడీ టీచర్లకు గ్రోత్ మానిటరింగ్ పరికరాలను అందజేస్తున్న ఐసీడీఎస్ వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి

చేర్యాల, ఏప్రిల్ 16 : అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ గ్రోత్‌రేట్‌ను పెంపొందింపచేయాలని ఐసీడీఎస్ వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. చేర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి లోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, కొండపాక మండలాల్లోని 187అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన గ్రోత్ మానిటరింగ్ పరికరాలను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో శారద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు సదరు పరికరాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారుల బరువు, ఎత్తును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, రోజూ కనీసం ఐదుగురు చిన్నారుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఎదుగుదల లేనివారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సరైన పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సంక్షేమాధికారి సావిత్రి, పోషణ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ కనకరాజు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ బావుల పూడికతీతకు.. రైతుల ఎదురు చూపులు

● ఆరేళ్లుగా పట్టించుకోని అధికారులు
● ఈజీఎస్‌కు అనుసంధానం చేసినా ఆదుకోని పథకం

మద్దూరు, ఏప్రిల్ 16: నిరుపేద ఎస్సీ, ఎస్టీ రైతులకు చెందిన వ్యవసాయ బావుల పూడికతీతకు కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేసింది. అయితే ఆరేళ్లుగా పూడికతీత పనులపై ఈజీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మండుటెండలతో భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఈసారి రైతులు అధికంగా వరి సాగుచేశారు.

పనులకు అనుమతులు ఇలా..

నిరుపేద రైతులకు చెందిన వ్యవసాయ బావుల పూడికతీత పనులను ఉపాధిహామీ కూలీలతో చేయిస్తారు. క్రేన్ సహాయంతో పూడికతీత మట్టిని బయటకు తీసేందుకు అనుమతి ఇవ్వడంతోపాటు ఒక్కో బావిలో తీసే పూడికతీతకు సుమారు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తుంది. ఆసక్తి గల రైతులు భూమి పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డ్ జిరాక్స్ ప్రతులతో ఫీల్డ్ అసిస్టెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. వాటిని టెక్నికల్ అసిస్టెంట్‌తో కలిసి పరిశీలించి ఒక్కో బావి పూడికతీతకు ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. దరఖాస్తులు సక్రమంగా ఉంటే 15 రోజుల్లో పూడికతీత పనులకు అనుమతులు లభిస్తాయి. 16 గజాల లోతు వరకు తవ్వకునేందుకు అనుమతులున్నాయి. బావుల్లో 196 క్యూబిక్ మీటర్ల తీసినందుకు ఒక్కో కూలీకి రూ.113.96, గట్టి దరికైతే 49 క్యూబిక్ మీటర్లకు రూ.218.25లు చెల్లించేది. క్రేన్ సహాయంతో 245 క్యూబిక్ మీటర్ల మట్టిని తీసినందుకు రూ.70లు అందిస్తుండగా ఆయిల్ ఇంజన్‌కు రూ.70లుగా నిర్ణయించారు. ప్రస్తుతం కూలీ రేట్లు పెరగడంతో ధరల వ్యత్యాసంలో భారీగా తేడా ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



లద్నూరులో పూడికతీత లేక వృథాగా ఉన్న వ్యవసాయ బావి

ఆరేళ్లుగా అనుమతులకు దూరం

2018 నుంచి ఇప్పటివరకు పూడికతీత పనులపై అనుమతులు లేకుండాపోయాయి. గతంలో మండలంలో సుమారు 120 మంది రైతులకు పైగా దరఖాస్తు చేసుకోగా.. కేవలం 9 మంది రైతులకు మాత్రమే అనుమతులు వచ్చాయి. అందులోనూ డబ్బు చెల్లింపులో తీవ్ర అన్యాయం చోటు చేసుకున్న బాధిత రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందనే ఆరోపణలున్నాయి. ఎస్సీలు 4,827మంది, ఎస్టీలు 1,924 మంది జాబ్‌కార్డు కలిగి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

కొత్త బావులకు అనుమతులు



కొత్త బావుల తవ్వకాలకు అనుమతులున్నాయి. జియాలజిస్టు ద్వారా తీసుకున్న సర్టిఫికెట్‌తో స్థానిక పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలి. 12 నుంచి 16 మీటర్ల లోతు తవ్వుకునే అవకాశం ఉన్నది. ఇందుకుగానూ ప్రభుత్వం రూ.1.80 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేయనున్నది. దరఖాస్తులను పరిశీలించి ఎస్టిమేషన్ వేసి పంపిస్తాం. ఆసక్తి గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలి.

- పరశురాములు, ఉపాధిహామీ ఈసీ, మద్దూరు

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

● రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన దాస్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందనదాస్, పాల్గొన్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 16: నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన దాస్ ఆయా జిల్లాల ఎన్నికల అధికారులకు సూచించారు. మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలకు సరిపడినన్ని బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉండేలా, పోలింగ్ కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను అత్యంత పకడ్బందీగా స్ట్రాంగ్ రూంకు చేరవేసేలా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్షన్ డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కుష్ఠు' నిర్మూలనకు కృషి చేయాలి



డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 16: కుష్ఠువ్యాధి నిర్మూలనకు వైద్యశాఖ సిబ్బంది సమన్వయంతో కృషిచేయాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి సూచించారు. మంగళవారం సిద్దిపేటలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి అధ్యక్షతన కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న నోడల్ సిబ్బంది, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, నిక్ష్యాస్ట్ యాప్‌లో కుష్ఠు వ్యాధిగ్రస్థుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. కుష్ఠువ్యాధి కార్యక్రమంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య తగ్గిపోవడంతో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు డాటాఎంట్రీ ఆపరేటర్లకు, సూపర్‌వైజర్లకు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా పూర్తిగా కుష్ఠువ్యాధి నిర్మూలనలో యాప్ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. నమోదు చేసిన సంఖ్య ద్వారా కొత్తగా కుష్ఠు వ్యాధిగ్రస్థులు జిల్లాలో ఎంతమంది నమోదవుతున్నారో తెలుసుకోవచ్చని, అందుకు అనుగుణంగా మందులను సరఫరా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రాష్ట్ర లెప్రసీ సొసైటీ సభ్యుడు కామేశ్వరరావు, నరసింహస్వామి, డీపీఎంవోలు, ఎన్ఎల్ఈపీ సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య రాముడిని దర్శించుకున్న రఘునందన్‌రావు



అయోధ్యలోని రాంలల్లా సన్నిధిలో రఘునందన్‌రావు

దుబ్బాక, ఏప్రిల్ 16: మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు మంగళవారం అయోధ్య రామ మందిరంలోని బాల రాముడి సన్నిధిలో నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు. ఈ నెల 18న నామినేషన్‌ను దాఖలు చేయనున్నట్టు తెలిపారు.

రేపు నామినేషన్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 16: మెదక్ లోక్‌సభ స్థానానికి గురువారం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి బస్వ లక్ష్మీనర్సయ్య తెలిపారు. పట్టణంలో 30 వేల మందితో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌లో నామినేషన్ వేస్తారని వెల్లడించారు. కార్యక్రమానికి గోవా సీఎం ప్రమోద్ పాండురంగ్ సావంత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

కోలపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.2లక్షలు పట్టివేత



నగదు స్వాధీన పత్రాన్ని ఇస్తున్న ఎస్ఐ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 16: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని 161వ జాతీయ రహదారిపై కోలపల్లి చెక్‌పోస్టు వద్ద మంగళవారం పేట ఎస్ఐ శంకర్ రూ. 2లక్షల నగదును పట్టుకున్నారు. మహారాష్ట్ర నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న షేక్ సమీర్ వాహనంలో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.2 లక్షలను తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ డబ్బులను సంగారెడ్డి గ్రీవెన్స్ కమిటీలో డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు.

కుటుంబ తగాదాలతో సొంతింటికే నిప్పంటించిన ఘనుడు

● రూ.5 లక్షల ఆస్తి నష్టం ● నారాయణరావుపేటలో ఘటన



కాలిపోతున్న ఇల్లు

నారాయణరావుపేట, ఏప్రిల్ 16: కుటుంబ తగదాలతో ఓ వ్యక్తి సొంత ఇంటికే నిప్పంటించిన సంఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామస్థులు, సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావుపేటకు చెందిన పొన్నవేణి నర్సింహులుకు వివాహం అయిన కొంత కాలానికి ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాడు. నాటి నుంచి తన భార్య బాగోగులు కూడా చూడలేదు. అక్కడ సంపాదించిన డబ్బులను తల్లిదండ్రులకు పంపించేవాడు. భార్య బీడీలు చేసుకుంటూ పిల్లలను పోషించుకునేది. స్వగ్రామానికి తిరిగి వచ్చాక కుటుంబాన్ని పట్టించుకోకపోగా శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసేవాడు. కుల పెద్ద సమక్షంలో పంచాయితీలు పెట్టినా తీరు మారలేదు. సోమవారం నర్సింహులు తన తల్లిదండ్రులతో డబ్బుల విషయంలో గొడవ పడ్డాడు. నా డబ్బులు నాకు ఇవ్వకపోతే ఇంటిని తగలబెడతానని బెదిరించగా, నీ ఇష్టం.. ఏం చేసుకుంటావో చేసుకో అని వారు బదులిచ్చారు. నర్సింహులు కోపం పట్టలేక భార్య, పిల్లలను కొట్టడంతో వారు భయంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయారు. అదే కోపంలో విచక్షణ కోల్పోయి వాహనంలోని పెట్రోల్‌ను ఇంట్లో వస్తువులపై చల్లి నిప్పంటించాడు. మంటలతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్, ఫ్రిజ్, ఇతర విలువైన సామగ్రితో పాటు మొత్తం కాలిపోయాయి. ఈ సమాచారమందుకున్న సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి ఫైర్ ఇంజన్ సిబ్బందిని రప్పించి మరిన్ని నివాసాలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. నర్సింహులు భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు.

కోళ్ల లోడ్ వ్యాన్ బోల్తా.. 300 కోళ్లు మృతి.. రూ. లక్ష నష్టం

● రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతోనే ఘటన



మృతి చెందిన కోళ్లు

రామాయంపేట, ఏప్రిల్ 16: రోడ్లపై వరిధాన్యం ఆరబోయటం రోడ్డు ప్రమాదాలకు దారి తీస్తున్నది. రామాయంపేట శివారు పాత హైవేపై కోళ్ల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం మంగళవారం బోల్తా పడింది. ఈ ఘటనలో సుమారు 300 కోళ్లు చనిపోగా రూ. లక్ష వరకు నష్టం వాటిల్లింది. రోడ్డుపై ఒక వైపున వరిధాన్యం ఆరబోయడం వల్ల వాహనం అదుపుతప్పి ఈ ప్రమాదం చోటు చేసుకోగా, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కాగా ఇటీవలే ఝాన్సీ లింగాపూర్ వద్ద ఓ బైక్ వరికుప్పను ఢీకొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందిన విషయం విదితమే. రెండు రోజుల క్రితం ఇదే విధంగా బైక్ అదుపు తప్పిన ఘటనలో మరొకరు గాయపడ్డారు. ఇలా తరచూ వాహనదారుల ప్రాణాల మీదకు వచ్చినా పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేవ చేసే అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

చేగుంట, ఏప్రిల్ 16: మెదక్ జిల్లా మొదటిసారిగా ఓ ఉన్నతాధికారిగా తనకు మంచి అవకాశం ఇచ్చిందని, రెండోసారి మెదక్ ఎంపీగా ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల పరిధిలోని వడియారంలో ఓ ఫంక్షన్‌హాలులో పార్టీ అధ్యక్షుడు కొమండ్ల నారాయణరెడ్డి అధ్యక్షతన చేగుంట, నర్సింగ్ మండలాల పార్లమెంట్ ఎన్నికల ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మెదక్ జిల్లాలో 11సంవత్సరాల పాటు పని చేసిన అనుభవం ఉందని, తనను ఎంపీగా గెలిపిస్తే కేంద్రంలో ఉన్నతాధికారుల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తాను కలెక్టర్‌గా ఉన్న రోజుల్లో సిద్దిపేట, గజ్వేల్ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే రూ.100 కోట్లతో వీవీఆర్ ట్రస్టు, విద్యానిధి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఓటమి భయంతో ప్రత్యర్థులు తనపై దుష్ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం వెంకట్రామారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డిలను కార్యకర్తలు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనోహర్ రావు, వెంకట నరసింహారెడ్డి, సతీష్‌రెడ్డి, రాజిరెడ్డి, జడ్పీటీసీలు మోదం శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఎంపీపీ చింతం సబిత, నార్సింగ్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, సొసైటీ వైస్ చైర్మన్ పట్నం తానేష, మాజీ సర్పంచ్ శ్రీనివాస్. రాజ గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

బాబోయ్ ఎండలు..

● బెంబేలెతుతున్న జనం ● ఎయిర్ కూలర్లు, శీతల పానీయాలకు డిమాండ్



చేర్యాలలో నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి



వేడికి తాళలేని ఆవుకు నీరు పడుతున్న రైతు



విక్రయాల కోసం తరలిస్తున్న కూలర్లు



తలకు గొడుగుతో బైక్‌పై వెళ్తున్న యువకులు

చేర్యాల. ఏప్రిల్ 16: ఎండలు మండుతున్నాయి. భగభగమండే సూర్యుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తుతున్నారు. బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. పనులకోసం బయటకు వెళ్లేవారు ఉక్కపోత, చెమటతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులకు, ఇతర కూలీపనులకు వెళ్లేవారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. మధ్యాహ్నం వేళల్లో నిప్పుల కొలిమిలా మండుతుండటంతో బయటకు ఎవరూ రాకపోవడం వలన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వస్తున్నవారు ఎండ తాకిడి నుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. కొందరు టోపీలు, టవళ్లు, స్కార్ఫ్‌లు ధరిస్తుండగా, మరికొందరు గొడుగులు ఉపయోగిస్తున్నారు. ఎన్నిసార్లు నీరు తాగినా దాహం తీరక శీతలపానీయాల కోసం పరుగులు పెడుతున్నారు. దీంతో పట్టణంలో శీతల పానీయాలు, ఫ్రూట్‌జ్యూస్ సెంటర్లు వెలిశాయి. ఆరోగ్యకరమైన కొబ్బరి బొండాలు, చెరుకు రసాన్ని సేవిస్తూ సేదతీరుతున్నారు. ఎండవేడిని తట్టుకునేందుకు ఫ్రిజ్‌లు, కూలర్లు కొనుగోలు చేస్తుండటంతో వాటికి డిమాండ్ పెరిగింది. ఎండవేడికి పశువులు అల్లాడుతున్నాయి.

డిహైడ్రేషన్ కాకుండా జాగ్రత్తపడాలి

ఇప్పటికే ఎండలు విపరీతంగా ఉన్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి. శరీరం డిహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి. సురక్షిత తాగునీరు, కొబ్బరి బొండాలు, ఓఆర్ఎస్ సేవించాలి. జంక్‌ఫుడ్‌ను విస్మరించాలి. చిన్నారులను ఎండ సమయంలో అసలు బయటకు తీసుకురాకూడదు.

- తుంగ రఘునందన్ రాణా, చిన్నపిల్లల వైద్యుడు

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం

● కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

నారాయణరావుపేట, ఏప్రిల్ 16: కాంగ్రెస్‌తోనే పేద, మధ్యతరగతి ప్రజలకు సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎస్సీ మాల సంఘం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే తమకు సంక్షేమ ఫలాలు అందాయని, బీఆర్ఎస్ పాలనలో తమకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని ఎస్సీ మాల సంఘం వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కే తమ మద్దతు అంటూ వారు ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం ఎస్సీ మాల కులస్థులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బర్ల రామచంద్రం, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గోలి అనిల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు బిట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణరావుపేటలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎస్సీమాల సంఘం నాయకులు



ములుగులో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు



వర్గల్ కేంద్రంలో అభివాదం చేస్తున్న ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ములుగు, ఏప్రిల్ 16: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి శ్రీనివాసుల ఆధ్వర్యంలో రాత్రి ములుగులో బీఆర్ఎస్ నాయకులు నర్సారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు ఓటు వేసి విజయం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీధర్ రఘురారెడ్డి, అర్జున్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయంపై హర్షం

వర్గల్, ఏప్రిల్ 16: మంత్రి వర్గంలో ముదిరాజ్‌లకు అవకాశం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో, మంగళవారం వర్గల్ కేంద్రంలో ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ సంఘం నాయకుడు తలారి బిక్షపతి, వర్గల్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీరాం నర్సింలు ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్ విరికల సమస్యలపై శాశ్వత పరిష్కార దిశగా ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ముందడుగు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు పసుల లింగం, నర్సింహులు, రాములు, చెన్నయ్య, సెంటారి నాగరాజు పాల్గొన్నారు.

ముదిరాజులకు కాంగ్రెస్‌తోనే న్యాయం

చేర్యాల, ఏప్రిల్ 16: ముదిరాజులకు కాంగ్రెస్‌తోనే న్యాయం చేకూరుతుందని, బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏకు మార్చుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలంగాణ ముదిరాజ్ జేఏసీ జనరల్ సెక్రెటరీ భీమ లక్ష్మణ్ అన్నారు. చేర్యాల పట్టణంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లను గుర్తించలేదని ఆరోపించారు.

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం

చేర్యాల, ఏప్రిల్ 16: ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని పార్లమెంటు ఎన్నికలలోనూ కాంగ్రెస్ గెలుపు తథ్యమని ఆ పార్టీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ పేర్కొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు లింగంపల్లి కనకరాజు, శ్రీకాంత్, కనకయ్య కంకణాల ప్రవీణ్ పాల్గొన్నారు.

మత రాజకీయాలకు స్వస్తి పలుకుదాం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడావెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 16: దేశ సమగ్రత, ఆర్థిక విధానాలను నాశనం చేస్తూ మత రాజకీయాలను రెచ్చగొడుతున్న బీజేపీ ప్రభుత్వానికి, మత రాజకీయాలకు స్వస్తి పలకాలని సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నేతలు దేశ ప్రధానితో కలిసి దేశ వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ దుర్మార్గపు, దద్దమ్మ మత విధానాలను, రెచ్చగొట్టే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మతోన్మాద బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో అవినీతిని అంతం చేస్తామని చెబుతున్న మోదీ అవినీతిపరులను వెంటవేసుకొని మహాసభలలో తిరుగుతున్నారని అన్నారు. దేశంలో బావోద్వేగ పూరిత మత రాజకీయాలను నడుస్తున్నాయని దీనిని ఐక్య ఉద్యమాలతో పోరాటంతో తిప్పి కొట్టాలని అన్నారు. సర్వమత సమానత్వ దేశం అని దానిని రక్షించుకోవడానికి ప్రజలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గ సభ్యులు వజ్రీష్, లక్ష్మణ్, శంకర్, కౌన్సిల్ సభ్యులు రూపేష్, శ్రీనివాస్, రజిని, జనార్దన్, మధు, రాజు, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూల్‌పై ఏబీవీపీ దాడి

● ఫర్నిచర్, కిటికీల అద్దాలు ధ్వంసం

సిద్దిపేటక్రైం, ఏప్రిల్ 16 సిద్దిపేటలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఓ కార్పొరేట్ స్కూల్ రెండవ బ్రాంచ్‌లో 9వ తరగతి విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్ పూర్తికాకముందే పదవ తరగతి సిలబస్ పరీక్షలు పెట్టడంతో ఏబీవీపీ నాయకులు మంగళవారం స్కూలు యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో స్కూల్‌లో ఫర్నీచర్, కిటికీ గ్లాసులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ విద్యా విధానానికి కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం తూట్లు పొడుస్తున్నదని ఆరోపిస్తూ దాడికి దిగినట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యం సొంత ప్రయోజనాలను పాటిస్తుందని ఆరోపించారు. అయితే ఈ దాడిలో ప్రైమరీ సెక్షన్‌లో ఉన్న చిన్నపిల్లలు ఇబ్బందులు పడ్డారని స్కూల్ యాజమాన్యం పేర్కొంది. ఏబీవీపీ నాయకులు స్కూల్ ఎదుట ధర్నా చేపట్టారు. స్కూల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు చేరుకుని ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రాజ్యాంగ వ్యవస్థలను నీరుగార్చుతున్న మోదీ ప్రభుత్వం

● తెలంగాణ జేసీసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి

హుస్నాబాద్, ఏప్రిల్ 16: రాజ్యాంగ వ్యవస్థలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నీరుగార్చుతున్నదని తెలంగాణ జేసీసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో నియోజకవర్గ జేసీసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ, ఆర్‌బీఐ, ఎన్నికల కమిషన్ లాంటి రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని బీజేపీ నియంత పాలన సాగిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో జేసీసీ కో కన్వీనర్ మేకల వీరన్నయాదవ్, ద్యాగల సారయ్య, ప్రతినిధులు కొయ్యడ కొంరయ్య, ముక్కిరి సంపత్‌కుమార్, కాంగ్రెస్, సీపీఐ నాయకులు బంక చందు, గడిపె మల్లేశ్, చెప్యాల ప్రభాకర్, వెన్న రాజు, వల్లపు రాజు, నరేష్, రమ తదితరులున్నారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ

మద్దూరు, ఏప్రిల్ 16: మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామంలో మంగళవారం సోషల్ ఆడిట్ జనరల్ ఆడిట్ బృందం ఉపాధిహామీ పథకంలో 2018 నుంచి 2022 వరకు నిర్వహించిన 16 పనుల్ని తనిఖీ చేసింది. ఈ సందర్భంగా సీనియర్ ఆడిటర్ ఎస్. శ్రీనివాసులు మాట్లాడారు. గ్రామంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల్లోంచి ఎంపిక చేసుకున్న 16 పనుల్ని సందర్శించామన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఉపాధిహామీ రికార్డులను తనిఖీ చేసినట్లు తెలిపారు. తదుపరి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో ఎస్. రామచంద్రం, ఆడిటర్స్ కల్యాణ్, శేషగిరి, కొండయ్య, ఆదిమాడ్ ఆడిట్ అధికారి శివాజీ, ఏపీఓ ప్రభాకర్, డివిజన్ విజిలెన్స్ అధికారి వినయ్, ఏఈ పంచాయతీరాజ్ పరుశరామ్, ఇన్ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకయ్య, మాధవి, దేవేందర్, సెక్రటరీ భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

'విద్యార్థులు సేవా గుణం అలవర్చుకోవాలి'

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 16: రక్త దానం చేయడం అభినందనీయమని, విద్యార్థులు సేవా గుణం అలవర్చుకున్నప్పుడే ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సునీల్ ప్రసాద్ పేర్కొన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలో రక్త దాన శిబిరాలు జరుగుతున్నాయని, 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వాసం శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం. త్రిదానందం, పల్లవి, ఎస్. మహేందర్, బిక్షపతయ్య, స్థానిక మెడికల్ కళాశాల, ఆసుపత్రి సిబ్బంది, వైద్యాధికారి స్వాతి, జూనియర్ డాక్టర్లు ఉపశ్రీ, వినీత, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, ఏప్రిల్ 16: అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏశ్రీనివాసరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి, అనంతరం 30మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వారితో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు నవీన్‌కుమార్, నాగరాజు, సునీల్, అనిల్‌కుమార్, రాహుల్, రమేశ్ బాబు, విజయ్‌కుమార్‌రెడ్డి, రాంచంద్రం, పెద్దిరాజు, జానకిరాం, కవిత, లక్ష్మినరసయ్య, మార్కండేయ, ఓంప్రకాశ్, విష్ణు శివ, రాజశేఖర్, రాజు, లావణ్య కైలాష్ తదితరులున్నారు.

పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన

దూళిమిట్ట, ఏప్రిల్ 16: మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో మంగళవారం గ్రామస్థులు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. గ్రామంలోని సమస్యలను ప్రత్యేకాధికారి, పంచాయతీ సెక్రటరీ పట్టించుకోవడంలేదని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మల్లేశం నర్సింహులు, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ మాట్లాడారు. గ్రామంలో ఉన్న సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ప్రత్యేకాధికారి ఇప్పటి వరకు గ్రామాన్ని సందర్శించలేదన్నారు. పంచాయతీ కార్మికులు ప్రజాపాలనలో పని చేయకుండా పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్నారని ఆరోపించారు. చెత్త సేకరించిన ట్రాక్టర్ డీజిల్ లేకపోవడంతో నడిరోడ్డుపై నిలిచి రెండు రోజులైనా పట్టించుకోవడం లేదన్నారు.

ప్రతిష్ఠా మహోత్సవాలకు ఆహ్వానం

గజ్వేల్/జగదేవ్‌పూర్, ఏప్రిల్ 16: మండల పరిధిలోని అనంతరావుపల్లి గ్రామంలో ఈ నెల 19 నుంచి నిర్వహించనున్న గ్రామ దేవతల ప్రతిష్ఠా మహోత్సవాలకు రావాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి గ్రామస్థులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆహ్వాన పత్రికను మాజీ సర్పంచ్ లు దానం మహేందర్, దామన్యగారి కొమురయ్య యాదవ్‌తో కలిసి ఎంపీటీసీ మాజీ వైస్ చైర్మన్ మాధారు శ్రీనివాస్ అందజేశారు.

జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌లో ఈ నెల 18నుంచి జరిగే బొడ్రాయి, గ్రామ దేవతల ప్రతిష్ఠా మహోత్సవాలకు రావాలని కోరుతూ, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణలు మాజీ కలెక్టర్, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డికి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డిలకు ఆహ్వానపత్రికలు అందించారు.

కరపత్రాలు, పోస్టర్ ఆవిష్కరణ

గజ్వేల్‌టౌన్/గజ్వేల్ ఏప్రిల్ 16: భద్రాచల దేవస్థానంలో జరిగే సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను, పోస్టర్లను శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని క్షేత్రాలయంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు గుర్తించిన భద్రాచల దేవస్థానం, భద్రాచలంలో జరిగే ప్రతి కార్యక్రమంలో రామకోటి సంస్థకు చోటు కల్పించడం ఆయన భక్తికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో క్షేత్రాలయం అధ్యక్షుడు యెలగందుల రామచంద్రం, మెట్టాకుల, వెంకటేష్, లక్ష్మయ్య, ప్రభాకర్, పలైపహాడ్ మాజీ సర్పంచ్ కొక్కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ

మద్దూరు, ఏప్రిల్ 16: మండలంలోని నర్సాయపల్లి, మద్దూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మండల వ్యవసాయశాఖాధికారులు తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలతో పాటు రైతులు తీసుకువస్తున్న ధాన్యాన్ని ఎప్పటిప్పుడు కాంటా వేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఏఈవో రాజేష్ మాట్లాడుతూ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

బీజేవైఎం జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా కరుణాకర్

మిరుదొడ్డి, ఏప్రిల్ 16: బీజేవైఎం జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా మిరుదొడ్డికి చెందిన కుర్మ కరుణాకర్‌ను మంగళవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దినేష్ నియమించారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

దుబ్బాక, ఏప్రిల్ 16: దుబ్బాకలోని పోస్టాఫీస్ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

ఇసుక డంపు సీజ్

బెజ్జంకి, ఏప్రిల్ 16: మండలంలోని గాగిల్లాపూర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు మంగళవారం దాడులు చేసి సీజ్ చేసినట్లు బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

దిగబడిన ధాన్యం లారీ

చేర్యాల, ఏప్రిల్ 16: చేర్యాల మండలం తాడూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని తాత్కాలిక డైవర్షన్ రోడ్డులో ధాన్యం లోడుతో ఉన్న లారీ దిగబడింది. దీంతో గంటల తరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణీకులు గౌరాయపల్లి గ్రామం మీదుగా చేర్యాలకు చేరుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జంకి, ఏప్రిల్ 16: మండలంలోని గుగ్గిళ్ల, బెజ్జంకి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ప్రతీ కూలీకి ఉపాధి కల్పించాలి

● డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య



సమావేశంలో మాట్లాడుతున్న జయదేవ్ ఆర్య

బెజ్జంకి, ఏప్రిల్ 16: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతీ కూలీకి పని కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఉపాధిహామీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను కూలీలు వచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీడీవో దేవకీదేవి, డీఎల్పీవో వెంకటేశ్వర్లు, మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మప్ప, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయాలి



పట్టణంలోని ఉమామహేశ్వరాలయం ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 16: వీరహనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర నాయకుడు దేశపతి రాజశేఖరశర్మ, సామాజిక సమరసత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేశ్‌బాబు పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఉమా మహేశ్వర, శివాలయంలో బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్, హైందవ సభ్యుల ఆధ్వర్యంలో రూపొందించిన వీర హనుమాన్ శోభాయాత్ర గోడపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 23న హనుమాన్ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసీతారామ, ఉమామహేశ్వర ఆలయం నుంచి సంకటవిమోచన దేవాలయం వరకు శోభాయాత్రను నిర్వహిస్తామన్నారు. వారితో హైందవ సంఘాల నాయకులు, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 16: పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ సెకండ్ లెవెల్‌లో పతకాలతో, ఉత్తమ ప్రతిభ కనబర్చి 329 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మెడలు సాధించిన అఖిల్, రెండవ బహుమతి ఐశ్వర్య, మూడవ బహుమతి రోహిత్ నాయక్‌లు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ తిరుమల్ తెలిపారు. బహుమతులు పొందిన విద్యార్థులను ఏజీఎం వాసాల సతీష్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీ విద్య మధు, డీన్ తిరుపతి, ఏవో తిరుపతి ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 16: హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం చివరి సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట, పాటలతో సంబరాలు చేసుకున్నారు. ఇందులో జిల్లాన కార్యక్రమంలో గతేడాదిలో రాష్ట్రస్థాయిలో ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజిరెడ్డి, కోమల, వెంకటేశ్వర్లు, రేణుక, పద్మ, రాజ్యలక్ష్మి, జ్యోత్స్న తదితరులున్నారు.

మరమ్మతులకు నోచుకోని చెక్ డ్యాంలు

● పట్టించుకోని అధికారులు



ధ్వంసమైన లింగాపూర్ చెక్ డ్యాం, కాజ్‌వే

దూళిమిట్ట, ఏప్రిల్ 16: భూగర్భ జలాలు పెరగాలని, వర్షపు నీరు వృథాగా పోవద్దనే ఉద్దేశంతో నిర్మించిన చెక్ డ్యాంలు ధ్వంసమై మరమ్మతులకు నోచుకోవడం లేదు. చెక్ డ్యాంల సైడ్ వాల్, కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు వాటిని పునర్నిర్మించడం కాదు కదా కనీసం మరమ్మతులు చేయిద్దామని కూడా అధికారులు అనుకోవడం లేదు.

వర్షాకాలంలో రైతులు ఇబ్బందులు

చెక్‌డ్యాంల కింద ఉన్న కాజ్‌వేలు తెగిపోవడంతో వర్షాకాలంలో రైతులు దూళిమిట్ట, లింగాపూర్ గ్రామాల నుంచి తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లడానికి చుట్టూ పది కిలోమీటర్లు ఇతర గ్రామాల మీదుగా వెళ్లాల్సి వస్తున్నది. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని, కనీసం ఈ ప్రభుత్వమైనా చొరవతీసుకొని ప్రజలు, రైతుల ప్రయోజనాల దృష్ట్యా వెంటనే చెక్‌డ్యాంల మరమ్మతు, కాజ్‌వేల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

> **ప్రభుత్వానికి నివేదికలు పంపాం**
>
> మండలంలోని లింగాపూర్, దూళిమిట్ట గ్రామాల మోయ తుమ్మెద వాగుపై ఉన్న చెక్ డ్యాంలు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతు, కాజ్‌వేల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తాం.
>
> - కె.సంతోష్, ఇరిగేషన్ ఏఈ, దూళిమిట్ట

వడదెబ్బ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

● జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్



తిమ్మాపూర్‌లో పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

దుబ్బాక, ఏప్రిల్ 16: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల్లో వడదెబ్బ పట్ల అవగాహన పెంచాలన్నారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఉపవైద్యాధికారి వినోద్ బాబీ, శ్రీనివాస్, సిబ్బంది మదనర్, హిమబిందు, రాజేశ్వర్ తదితరులున్నారు. ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. డీహైడ్రేషన్ అయినప్పుడల్లా ఓఆర్ఎస్ ప్యాకెట్ ఒక లీటరు నీటిలో కలిపి తీసుకోవాలని సూచించారు. అనంతరం అద్దూరు పీహెచ్‌సీలో సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతిభ, మల్‌హోత్రి, కార్యదర్శి మాధవ్, ఆశాలు, ఏఎన్ఎం యాదమ్మ పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి

మద్దూరు, ఏప్రిల్ 16: వేసవిలో పలు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి బయటపడొచ్చని అద్దూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సుదీర్‌రాజ్ తెలిపారు. మంగళవారం మండలంలోని రేబర్తి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో

నవమి వేడుకలకు ఆలయాల ముస్తాబు



హుస్నాబాద్‌లోని దేవాలయంలో సీతారాములు

హుస్నాబాద్/రాయపోల్ ఏప్రిల్ 16: హుస్నాబాద్ పట్టణంలోని రామాలయం రోడ్డులో ఉన్న రామాలయం బుధవారం జరిగే శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబైంది. ఆలయ నిర్వాహకులు అందుకు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారని, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారని నిర్వాహకులు తెలిపారు.

శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ ఉత్సవాల కోసం రాయపోల్ మండలంలోని వడ్డేపల్లిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 18న స్వామివారి రథోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అదే రోజు బోనాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రాయపోల్, అనాజీపూర్ తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భాష పరిరక్షణ కోసం చేస్తున్న కృషి అభినందనీయం

● సిద్దిపేట ఎంఈవో సత్తు యాదవరెడ్డి


సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 16: మరుగున్న సమాజంలో తెలుగు భాష పరిరక్షణ కోసం తెలుగు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి గొప్పదని, సాహిత్యాభిరుచి గలవారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు ఎక్కువగా ఉంటాయని తెలుగు బాపుతున్న మాధుర్యం గొప్పదని, విద్యార్థుల్లో సృజనాత్మకతకు మెరుగులు దిద్దుతున్న సుగుణ సాహితీ సేవ ప్రశంసనీయమని సిద్దిపేట ఎంఈవో సత్తు యాదవరెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సుగుణ సాహితీ సమితి కన్వీనర్ భైతి దుర్గయ్య అధ్యక్షత, సుగుణ సాహితీ సమితి ద్వారా భాషా కథల పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 20 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులను కథలు రాసేలా ప్రోత్సహించిన మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా పరిషత్ విభాగం కార్యదర్శి సయ్యద్ షౌకత్ అలీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మర్యాద చెన్నకృష్ణారెడ్డి, బాల సాహితీ వేత్త సంపనపల్లి రాము కృష్ణయ్య కవి, కొమురెల్లి అంజయ్య వరుతుల వర్మపల్లి యాదగిరి, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

అమలు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి..

● బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొట్టాల యాదగిరి ముదిరాజ్



వర్గల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కొట్టాల యాదగిరి ముదిరాజ్, తదితరులు



నారాయణరావుపేట: కల్లాల వద్ద నుంచి ఉత్తరాలు రాసి చూపుతున్న నాయకులు, రైతులు

వర్గల్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిందని, పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం వర్గల్ మండల కేంద్రంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉడుత ఊపులకు భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు లింగ నాగరాజు, నాయకులు పడిగేరాజు, స్వామి, నరేష్, రమేశ్, శేఖర్, నర్సింహులు తదితరులున్నారు.

ఆర్యవైశ్యులంతా బీఆర్ఎస్ వెంటే

గజ్వేల్, ఏప్రిల్ 16: ఆర్యవైశ్యులంతా బీఆర్ఎస్ వెంటే ఉంటారని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మే 13న జరిగే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి విజయం ఖాయమన్నారు. వారివెంట బీఆర్ఎస్ నాయకులు నంగునూరి సత్యనారాయణ, రావికంటి చంద్రశేఖర్, దొంతుల సత్యనారాయణ, గోవర్ధన్, తొడుపునూరి రాజు, బన్ను నాగేందర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

మర్కుక్, ఏప్రిల్ 16: వంద రోజుల క్రితం సస్యశ్యామలంగా ఉన్న రాష్ట్రం ఇప్పుడు ఎడారి ప్రాంతంగా మారిందని, త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అఖండ విజయం సాధిస్తుందని బీఆర్ఎస్ మండల బీసీసెల్ అధ్యక్షుడు, జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు మక్కల కనకయ్య అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 100 రోజుల కాంగ్రెస్ పాలనలో 100 తప్పులు చేసి ఎలక్షన్ కోడ్ పేరుతో తప్పించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు.

హామీలను అమలు చేయాలి

నారాయణరావుపేట, ఏప్రిల్ 16: హామీలను అమలు చేయాలని ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ఇబ్రహీంపూర్, జక్కాపూర్, మాటిండ్ల గ్రామాల్లో రైతులు కల్లాల వద్ద నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్, ఎంపీటీసీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్, నాయకులు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి ప్రచారం

బెజ్జంకి, ఏప్రిల్ 16: పార్లమెంట్‌లో బలమైన గొంతుకగా నిలిచే వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ సతీమణి మాధవి కోరారు. మంగళవారం మండలంలోని దాచారం, లక్ష్మీపూర్, బేగంపేట, వడ్లూరు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ కవిత, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.